క్లుప్తంగా

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

అర్ధవీడు: మండలంలోని పాపినేనిపల్లి, అర్ధవీడు, రంగాపురం, మొహిద్దీన్‌పురం, దొనకొండ గ్రామాల్లో శుక్రవారం మిలాద్ ఉన్ నబి పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఇస్లాం మత ప్రవక్త మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ఆయన జీవితం, బోధనలను స్మరించుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక నమాజులు చేశారు. సేవా కార్యక్రమాలు, పేదలకు అన్నదానం, దుస్తుల పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వర స్వామి కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం: పట్టణ శివారులోని గుండ్లకమ్మ నదీ ఒడ్డున ఉన్న శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి వారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ మధ్య రంగ మండపంలో ఉభయ దేవేరులతో కలిసి స్వామివారిని ప్రతిష్ఠించి పూలతో, ఆభరణాలతో అలంకరించి అర్చకులు కల్యాణ క్రతువు నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణ, సభ్యులు, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం అన్న వితరణ జరిగింది.

యూనియన్ అభివృద్ధికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బాషా

పొదిలి: ఈయూ యూనియన్ అభివృద్ధికి యూనియన్ సభ్యులు ఐక్యంగా ఉండి కృషి చేయాలని ఈయూ డిపో అధ్యక్షుడు ఎండీఏ బాజీ, జోనల్ అధ్యక్షుడు వాకా రమేష్ అన్నారు. శుక్రవారం పొదిలి ఆర్టీసీ డిపో జనరల్ బాడీ యూనియన్ సమావేశం డిపో సెక్రటరీ ఓబులేసు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ డిపోలోని సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి త్వరలో డిపో మేనేజర్‌ను కలిసి వినతి పత్రం ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో ఎంఎంయూఏ నుంచి డ్రైవర్లు ఏఎస్‌రావ్, టీకే రావు, ఎస్.శ్రీనులు ఈయూలో చేరారు. సమావేశంలో జోనల్ జాయింట్ సెక్రటరీ పోలయ్య, రాష్ట్ర కమిటీ మెంబర్ కొండలరావు, జిల్లా ట్రెజరర్ ఓబులయ్య, రామకృష్ణ, అంజయ్య, వెంకట్రావు, పొదిలి యూనియన్ నాయకులు షరీఫ్, కాలేబు, దివాకర్, బాషా, రమేష్, రోషన్, వెంకట్రావు, జిలానీ, మహిళా నాయకులు చంద్రకళ, పద్మ, విజయలక్ష్మి, పండరి, దరియాబి, కాంతమ్మ, నాగమల్లేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి


రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

గిద్దలూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ 11వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ అన్నారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఈ నెల 20, 21 వ తేదీల్లో ఒంగోలులో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరం కలిసి ముందుకు సాగాలన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 5 సంవత్సరాల లోపు పిల్లలందరూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండేలా, ప్రభుత్వ చట్టం చేయాలని అన్నారు. ప్రీ స్కూల్ సక్రమంగా జరిగేలా ప్రభుత్వం చొరవచూపాలన్నారు. ఇటువంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఐకమత్యంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మున్నా, స్వర్ణకుమారి, విజయ, సరస్వతి, రమణమ్మ, బాలమ్మ, సుజాత పాల్గొన్నారు.

జీఎస్టీ తొలగించడంపై హర్షం

మార్కాపురం: జీవిత బీమా, ఆరోగ్య బీమా పథకాలపై జీఎస్టీని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల పరిరక్షణ కమిటీ సభ్యుడు ఓరుగంటి మల్లిక్ హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్య బీమా పథకాలపై జీఎస్టీ రద్దు చేయాలని పలుసార్లు కేంద్ర, రాష్ట్ర వినియోగదారుల సమావేశాల్లో డిమాండ్ చేశామన్నారు. ఇటీవల ఈ విషయంపై జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య తరఫున జాతీయ వినియోగదారుల కోరంలో కేసు ఫైల్ చేశారు. ఈలోపే కేంద్ర ప్రభుత్వం ఇలాంటి పథకాలపై జీఎస్టీని తొలగించడం మంచి పరిణామమన్నారు. నిత్యావసరాలపై 18 నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గించడం సంతోషించదగిన విషయమన్నారు.

సర్కారు వైద్యం దైవాధీనం!

ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషలిస్టు వైద్యులున్నా సాధారణ సేవలకే పరిమితం

సమస్య చిన్నదైనా, పెద్దదైనా ఒంగోలు, గుంటూరు, నంద్యాలకు రిఫర్

సర్కారు వైద్యం దైవాధీనంగా మారింది. రోగమొచ్చినా రొప్పొచ్చినా పేద, మధ్య తరగతి ప్రజలు తొలుత అడుగుపెట్టేది ప్రభుత్వ వైద్యశాలల్లోనే. అలాంటి ఆస్పత్రుల్లో వైద్య సేవలు కుంటుపడటంతో పోలోమంటూ ప్రైవేట్ ఆస్పత్రులు, స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తున్న దుస్థితి. ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది నియామకం, మౌలిక వసతులు కల్పించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లోని ఆస్పత్రులు క్రమంగా సేవలకు దూరమవుతున్నాయియి.

- గిద్దలూరు 100 పడకల ఆస్పత్రిలో వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- కంభం 50 పడకల ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అరకొరగా సేవలు
- కంభంలో తరచూ మొరాయిస్తున్న ఎక్సరే యంత్రం
- కొమరోలు, పొదిలి ఆస్పత్రుల్లో ఎక్సరే గదులకు తాళం
- పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత
- ల్యాబ్‌ల్లో రక్త పరీక్షల సంగతి సరేసరి..
- సేవలు.. సగం సగం..


పనిచెయ్యని ఆర్వో ప్లాంట్

కంభం:

కంభం ప్రభుత్వ వైద్యశాలలో స్పెషలిస్టు వైద్యులున్నప్పటికీ పూర్తి స్థాయిలో సేవలు అందకపోవడంతో కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల ప్రజలు చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా ఇతర ప్రాంతాలలకు వెళ్లాల్సిన పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో కంభం వైద్యశాలను సుమారు రూ.3 కోట్లతో అభివృద్ధి చేసి అదనపు గదులు నిర్మించారు. ప్రస్తుతం వైద్యశాలలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉండటంతో రోగులకు పూర్తి స్థాయిలో సేవలందడం లేదు. వైద్యశాలలో స్పెషలిస్టు డాక్టర్లు ఉన్నప్పటికీ ఇక్కడికి వచ్చిన రోగులు, క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి మార్కాపురం, ఒంగోలుకు రిఫర్ చేస్తున్నారు. పీడియాట్రిక్, గైనకాలజిస్టు, అనస్తీషియా, అప్తమాలజిస్టు, ఈఎన్‌టీ, డెంటల్, ఫిజియోథెరపి వైద్యులున్నప్పటికీ అవసరమైన సదుపాయాలు, పరికరాలు లేకపోవడంతో సాధారణ ఓపీలకే పరిమితం అవుతున్నారు. డిజిటల్ ఎక్సరే యంత్రం సైతం తరచూ మొరాయిస్తుండటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. వైద్యశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్ గత కొన్నిరోజులుగా పనిచేయక పోవడంతో రోగులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

బ్లడ్ స్టోరేజీ సౌకర్యం లేక ఇక్కట్లు

పేరుకు 50 పడకల వైద్యశాల అయినప్పటికి ఇక్కడ బ్లడ్ స్టోరేజీ సౌకర్యం లేదు. గర్భిణులకు సర్జరీల సమయంలో రక్తం అవసమరైతే మార్కాపురం, ఇతర ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. ప్రమాదాలు, అత్యవసర సమయాల్లో రక్తం అందక క్షతగాత్రులు, రోగులు ఇబ్బంది పడుతున్నారు.

నాడిపట్టే వారు లేరు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు 100 పడకల ప్రభుత్వ వైద్యశాలలో రోజూ 500 నుంచి 600 వరకు ఓపీ ఉంటుంది. అటువంటి వైద్యశాలలో జనరల్ మెడిసిన్, సివిల్ సర్జన్, సీఎస్‌ఆర్‌ఎంఓ, రేడియాలాజిస్టు, గైనకాలజిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆర్థో, అప్తాల్మిక్, ఈఎన్‌టీ వైద్యులు ఉన్నప్పటికి ఆపరేషన్లు చేయడం లేదు. ఈఎన్‌టీ బాధితులను పరీక్షించేందుకు ఆడియోమెట్రిక్ యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో రోగులు నంద్యాల, కర్నూలు వెళ్లాల్సి వస్తోంది. కుమ్మరాంకట్ట వద్ద అర్బన్ హెల్త్ సెంటర్, నంద్యాలరోడ్డులోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, టిడ్కో గృహాల వద్ద గల జగనన్న కాలనీలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఇన్సులిన్ అందుబాటులో లేకపోవడంతో సుగర్ బాధితులు ఆర్‌ఎంపీలను, ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

ఎక్సరే కోసం గిద్దలూరు వెళ్లాల్సిందే..

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలు పీహెచ్‌సీలో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఒకే ఒక వైద్యాధికారి రోగులకు అందుబాటులో ఉన్నారు. ఈ వైద్యశాలలో రోజూ 100 ఓపీలు నమోదవుతాయి. ఎక్సరే ప్లాంటు మరమ్మతులకు గురికావడంతో సుదూర ప్రాంతాలైన గిద్దలూరు, మార్కాపురం, నంద్యాల వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన దుస్థితి. మంగళవారం వైద్యశాలలో బెడ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి.

ఆసరా ఆపేసి.. రోగులను కష్టాల్లోకి తోసి..

బేస్తవారిపేట: అనారోగ్య సమస్యలతో ఆస్పత్రులకు వెళ్తుంటే పూర్తి స్థాయిలో వైద్యం అందని పరిస్థితులు దాపరించాయని ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారు. శస్త్ర చికిత్సలు చేయించుకుని డిశ్చార్జ్ అయ్యే సమయంలో ఆరోగ్య ఆసరా కింద గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొంత నగదు అందించేది. రోగి పౌష్టికాహారం తీసుకునేందుకు విశ్రాంతి సమయంలో రోజుకు రూ.225 ప్రకారం వైద్యులు నిర్దేశించిన కాలానికిగాను నగదు రోగుల బ్యాంకు ఖాతాకు జమయ్యేది. కనీసం రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు రోగులకు నగదు అందించే ఆరోగ్య ఆసరా పథకాన్ని కూటమి ప్రభుత్వం రాగానే రద్దు చేసింది. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, కంటి పరీక్షలు కనుమరుగయ్యాయి.

ఫిజియోథెరపిస్ట్‌తో వైద్యం

పొదిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు రూ.2 కోట్లు ఖర్చు చేశారు. నాడు పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది నియమించారు. ఓపీల సంఖ్య రోజుకు సగటున 350 వరకు ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితులు తారుమారయాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఓపీలు సగటున 200కు తగ్గాయి. రెగ్యులర్ వైద్యులు ఎవరూ విధుల్లో లేకపోవడంతో ఫిజియోథెరపిస్ట్ ఓపీ చూడాల్సి వస్తోంది. ఎక్సరే గదికి వేసిన తాళం కొన్ని నెలలుగా తీయలేదు.

ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలు


చికిత్స పొందుతున్న బాలికతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి


మందులు పరిశీలిస్తున్న వైద్యాధికారి

- జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు

సాక్షి ఎఫెక్ట్..

కొనకనమిట్ల: ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో 'జ్వర పీడితం..ప్రాణ భయం కంపితం' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి వెంకటేశ్వర్లు గొట్లగట్టు ప్రభుత్వ వైద్యశాలను శుక్రవారం పరిశీలించారు. అక్కడ జ్వరాలతో పాటు పలు వ్యాధులతో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా, మందులు ఇస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, వైద్యశాలలోని మందులు, ల్యాబ్‌ను పరిశీలించారు. ప్రస్తుత సీజన్‌లో ప్రజలు మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. అందుకనుగుణంగా ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్య సేవలు అందించాలని స్థానిక ప్రభుత్వ వైద్యులు ఎస్పీ బాలయ్యకు సూచించారు. వైద్య సిబ్బది పారిశుధ్య కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం మండలంలోని సిద్ధవరం, పెదారికట్ల హెల్త్ క్లీనిక్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. హెల్త్ సెంటర్లలో సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉండి వెద్య సేవలు అందించాలన్నారు. ఏదైనా పెద్ద కేసులు నమోదైతే జిల్లా వైద్యశాలకు రిఫర్ చేయాలని వైద్యులకు సూచించారు. పంచాయతీల ద్వారా సైడు, మురుగౌరిఉ కాలువల్లో ఎబెట్ ద్రావణం పిచికారీ చేయించాలన్నారు. అవసరమైన చోట ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ బాలయ్య, సబ్ యూనిట్ అధికారి జి.కృష్ణ, హెఈఓ నారాయణ రెడ్డి, జె.వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికపై స్పష్టత కరువు

- కూటమి నాయకుల చేతుల్లోకి మున్సిపల్ పాలన
- నామినేటెడ్ పద్ధతిన పనుల అప్పగింత


మార్కాపురం మున్సిపల్ కార్యాలయం

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘానికి ఛైర్మన్ లేక మూడు నెలలు కావస్తోంది. కూటమి నాయకులు జూన్ 11న ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఇప్పటికి మూడు నెలలు అవుతున్నా అధికారుల నుంచి ఎటువంటి ఎన్నిక ప్రక్రియ లేకున్నా తదుపరి ఛైర్మన్ నియామకం ఎప్పుడా అనేది కూడా అటు అధికారుల్లో.. ఇటు నాయకుల్లో.. ఆసక్తి నెలకొంది. కలెక్టర్ ప్రకటన జరిగిన తర్వాతే నూతన ఛైర్మన్ ఎవరనేది ఎన్నుకోవాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకూ ఎటువంటి ప్రకటన వెలువడక పోవడంతో మున్సిపాలిటీ ఛైర్మన్ లేక కార్యాలయం వెలవెలబోతోంది. నాటి నుంచి ప్రతి నెలా జరగాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కూడా ఇప్పటి వరకూ జరగలేదు. ఇదిలా ఉంటే మున్సిపల్ కార్యాలయాన్ని కూటమి కౌన్సిలర్లు తమ పెత్తనాన్ని అధికారులపై చూపి తమ పనులను చక్కబెట్టుకుంటున్నారని కొందరు అధికారులు చర్చించుకుంటున్నారు. ఇంజినీరింగ్, శానిటేషన్, రెవెన్యూ ఇలా తదితర శాఖలపై తమ ఆధిపత్యాన్ని చాటుకుంటూ తమకు అనుకూలమైన వారికి పనులు చక్కపెట్టేస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్ ఉంటే తమ పనులకు ఎక్కడ అడ్డుపడతారో అని కూటమి నాయకులు భావించారు. కౌన్సిల్ అజెండాను ఆమోదించాల్సిన బాధ్యత కూడా ఛైర్మన్‌పై ఉండటంతో తొలుత ఛైర్మన్‌ను అడ్డు తొలిగించుకుంటే తమకు అడ్డు ఉండదని భావించి కూటమి నాయకులు అనుకున్నదే తడవుగా కలెక్టర్ దృష్టికి అవిశ్వాస తీర్మానం నోటిసు ఇవ్వడంతో పాటు అవిశ్వాస సమావేశ తేదీని కూడా ప్రకటించుకున్నారు. పురపాల కసంఘానికి ఛైర్మన్ లేకపోవడంతో ఉన్న అధికారుల వద్దకు వెళ్లి తమకు అవసరమైన పనులను చేయించుకుంటూ తమ ఆధిపత్యాన్ని చూపుతున్నారని మరికొంతమంది అధికారులు మదన పడుతున్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


పిచ్చయ్య యాదవ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు


జేసీ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న బూదాల నాజీర్ సురేష్‌బాబు


పురస్కారం అందుకుంటున్న రఫీ

గిద్దలూరు రూరల్: ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు డా.మొర్రిపిచ్చయ్య యాదవ్‌కు గ్రంథాలయ కమిటీ నిర్వాహకులు పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ సంఘ సేవకుడు బీ.ఎస్.నారాయణరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ సమాజసేవలో తనదైన పాత్ర వహిస్తూ పిచ్చయ్యయాదవ్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ నిర్వాహకులు గంజి వీరయ్య, విశ్రాంత ఉపాధ్యాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.రవీంద్రారెడ్డి, విశ్వభారతి స్కూల్ ప్రిన్సిపల్ బండారు ఆదిలక్ష్మి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి.స్వరూపారెడ్డి, ఉపాధ్యాయులు శివప్రసాదు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కార్యాలయంలో జోనల్ కన్వీనర్ టి.సుబ్బరాయుడు ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయుల విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా సురేష్‌బాబు

కంభం: మండలంలోని చిన్నకంభం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న బూదాల నాజీర్ సురేష్‌బాబు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో నిర్వహించిన గురుపూజోత్సవంలో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, డీఈఓ కిరణ్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్న ఎంఈఓలు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది, అధ్యాపకులు అభినందించారు.

ఉపాధ్యాయుడు రఫీకి సాహితీ పురస్కారం

తర్లుపాడు: మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా విజయవాడలో శుక్రవారం కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవం కార్యక్రమం తర్లుపాడుకు చెందిన ఉపాధ్యాయుడు ఎస్ఎండీ రఫీకి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సాహితీ సత్కారం అందించారు. అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు ఉపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రఫీ తాడివారిపల్లి జెడ్పీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

గురువులను గౌరవించుకుందాం..


రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వెన్నా హనుమారెడ్డి


బేస్తవారిపేటలో ఎంఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయినులు


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ షంషేర్ ఆలీబేగ్


కొమరోలు : విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓలు


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సుబ్బారావు


ఉత్తమ ఉపాధ్యాయుడు రమేష్

మార్కాపురం: గురువులను గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు వెన్న హనుమారెడ్డి, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ షంషేర్ ఆలీ బేగ్ అన్నారు. శుక్రవారం గురుపూజ దినోత్సవం (టీచర్స్ డే) సందర్భంగా వీహెచ్‌ఆర్ విద్యా సంస్థల్లో, ఏ-1 గ్లోబల్ కళాశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ దేశాభివృద్ధికి చేసిన సేవలను గుర్తుచేశారు. ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా చదువు నేర్పిన గురువును విద్యార్థులు మర్చిపోకూడదన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డైరెక్టర్ మసూద్ ఆలీబేగ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ రఫీ, శర్మ పాల్గొన్నారు.

కొమరోలు: స్థానిక ఎంఈఓ కార్యాలయ ఆవరణలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు వెంకటేశ్వర్లు, వెంకటరత్నం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గత విద్యాసంవత్సరంలో రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు పూలమాలలతో, శాలువాలతో సన్మానించారు.

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణతో తరగతులు నిర్వహించారు. ఎంఈఓ ఎస్ మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సత్యవతి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని వెలిగండ్ల ఏపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ముట్లూరి సుబ్బారావు, చింతగుంట హెచ్‌డబ్ల్యూ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వి.రమేష్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఆ మేరకు శుక్రవారం ఒంగోలులో నిర్వహించిన గురుపూజోత్సవంలో జిల్లా అధికారుల చేతుల మీదుగా వారు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ప్రశంసపత్రం అందుకున్నారు. ఎంఈఓలు ఎస్‌కే డాంగే షరీఫ్, నరసింహారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు వస్తుందని, అందుకు నిదర్శనం రమేష్, సుబ్బారావులను పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను వెలిగండ్ల సర్పంచ్ పి.వెంకటరెడ్డి, ఏపీ పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ ఎస్‌కేజీ మస్తాన్, పాఠశాల ఛైర్మన్ పి.నాగేష్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు దాసరి గురుస్వామి అభినందించారు.

హక్కుల కోసం కార్మికులు పోరాటం చేయాలి

మార్కాపురం: హక్కుల కోసం కార్మికులు పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి అన్నారు. శుక్రవారం సీఐటీయూ పట్టణ 12వ మహాసభ స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జెండాను జి.చెన్నకేశవులు, నన్నేసా ఎగుర వేశారు. కొండారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కుల కాలరాస్తున్నాయని, పోరాడి సాధించుకున్న చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లకు మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల కాలంలో వేతనాలు పెంచకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. జాతి సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ చేయడం, ప్లాంటుల్లో పనిచేస్తున్న 5 వేల మంది కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగించడాన్ని ఆయన ఖండించారు. స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, రైతు సంఘ నాయకులు సోమయ్య, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు జి.బాలనాగయ్య, యూటీఎఫ్ నాయకులు వీరారెడ్డి పాల్గొన్నారు. రూబెన్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.


అన్నా రాంబాబును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

బైబై వినాయక..


మట్టి వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

మార్కాపురం: పట్టణంలోని 5వ బ్లాక్ హరిజనవాడ రామాలయం వద్ద గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు శుక్రవారం దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట కమిటీ సభ్యులు రవి, సాయి, వంశీ, మురళీతో పాటు పోలేరమ్మ దేవస్థానం కమిటీ ప్రతినిధి దారా చెన్నకేశవులు ఉన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

గణేష్ నవరాత్రుల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో గణనాథులకు ప్రత్యేక పూజలు చేసి రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించి నిమజ్జనానికి తరలించారు. విగ్రహాల వెంట పట్టణ ఎస్సై సైదుబాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

మార్కాపురం టౌన్: పట్టణంలోని కోనేటి బజారులో ఏర్పాటు చేసిన మట్టి వినాయకునికి భక్తులు నీరుపోసి నిమజ్జనం చేశారు. గణేష్ విగ్రహానికి అర్చకులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకునికి మహిళా భక్తులు బిందెలతో నీరు తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో జగదాంబ అమ్మవారు

మార్కండేశ్వరస్వామి ఆలయంలో వెలసిన జగదాంబ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వరుణ్ తేజ, ఆంజనేయ ప్రసాద్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.